# రామన్నగూడెంలో మిస్టరీ?

- స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న 14 మంది యువకులు
- వారం రోజుల తర్వాత ముగ్గురు యువకులకు అస్వస్థత
- చికిత్స పొందుతూ ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



శ్రవణ్ కుమార్, ఎస్కే రహీంపాషా (ఫైల్)

నర్సింహులపేట, జూలై 4 : నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో ఇద్దరి యువకుల మరణం మిస్టరీగా మారింది. మిత్రుడి పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న 14 మంది యువకుల్లో ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. చికిత్స పొందుతూ ఒకరి తర్వాత ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకి వెళితే.. రామన్నగూడెం గ్రామానికి చెందిన బోగోజు శ్రావణ్ (25), ఎస్కే రహీం (24), పాడూరి ఉపేంద్రాచారితో సహా 14 మంది యువకులు జూన్ 10వ తేదీన అదే గ్రామానికి చెందిన తమ స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో సంతోషంగా పాల్గొన్నారు. అయితే, ఏమైందో ఏమో గానీ వారం రోజుల తర్వాత వారిలో ముగ్గురు యువకులు శ్రావణ్, రహీం, ఉపేంద్రాచారి తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానలో చికిత్స పొందుతూ ఒకరి తర్వాత ఒకరు ఇద్దరు యువకులు శ్రావణ్, రహీం మృతి చెందారు. ఉపేంద్రాచారి పరిస్థితి విషమంగా ఉంది. అయితే, పుట్టిన రోజు వేడుకలో 14 మంది యువకులు పాల్గొనగా, వారిలో ముగ్గురు మాత్రమే అస్వస్థతకు గురికావడంపై గ్రామ ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పుట్టిన రోజు వేడుకలో స్నేహితులు కల్లుతోపాటు మధ్యాహ్నం సమయంలో మద్యం తాగారు. అదే రోజు రాత్రి వారిలో ముగ్గురు మాత్రమే మళ్లీ కల్లు తాగారని, వారు మాత్రమే అస్వస్థతకు గురికావ డంపై గ్రామస్తులు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. కల్లు తాగిన వారం రోజుల తర్వాత అస్వస్థతకు గురైన ముగ్గురికి జిల్లా కేంద్రంతోపాటు ఖమ్మంలోని ఓ దవాఖానలో చికిత్స చేయించారు. అయినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో హైదరాబాద్‌లోని యశోద, నిమ్స్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ బోగోజు శ్రావణ్ బుధవారం మృతి చెందగా, ఎస్కే రహీం గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. మరో యువకుడు పాడూరి ఉపేంద్రచారి పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరి యువకుల మృతిపై కారణాలు తెలియరాలేదు. కావాలనే ఎవరైనా కల్లులో లేదా తిన్న ఆహారంలో, కేక్‌లో ఏమైనా కలిపారా?, కలిసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్లులో మిథైల్ ఆల్కహాల్ కలిసిందని, కల్లు కుండలో కలుపు మందు కలిసిందని కొంతమంది అనుమాన పడుతున్నారు. పోలీసులు కూడా పలు కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్సై సతీశ్ వివరణ కోరగా.. మృతి చెందిన బోగోజు శ్రవణ్ తల్లి జయప్రద ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వైద్యులు ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా మరణాలకు గల కారణం తెలుసుకుంటామని చెప్పారు. కాగా, శ్రావణ్ తండ్రి చిన్నతనంలో మృతిచెందడంతో కుటుంబ బాధ్యత అతడిపైనే ఉంది. అర్థాంతరంగా అతడు మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడింది. రహీం గ్రామంలో కారోబార్‌గా పని చేస్తూ గ్రామ ప్రజలకు తలలో నాలుకలా ఉండేవాడు. ఒక్కసారిగా ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## కొడుక్కి తలకొరివి పెట్టిన తల్లి



శ్రవణ్‌కు తలకొరివి పెడుతున్న తల్లి జయప్రద

చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో కొడుకు బోగోజు శ్రవణ్‌ను తల్లి అల్లారుముద్దుగా పెంచుకున్నది. ఈ నేపథ్యంలో అతడు అనుమానాస్పదంగా మృతి చెందడంతో తల్లి జయప్రద గురువారం తలకొరివి పెట్టింది. ఇది చూసిన గ్రామస్తులు ఇలాంటి కష్టం పగవాడికి కుడా రావద్దు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

# పింఛన్.. పక్కదారి..

- విరమణ ఉద్యోగులకూ 'చేయూత'
- సెర్ప్ తనిఖీల్లో వెలుగులోకి..
- జిల్లాలో 240 మంది ఉన్నట్లు గుర్తింపు
- అనర్హులను గుర్తించే పనిలో అధికారులు

హనుమకొండ, జూలై 4 : ప్రభుత్వం అందిస్తున్న చేయూత (ఆసరా) పింఛన్లు పక్కదారి పడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ విరమణ ఉద్యోగులు ఈ పింఛన్లు పొందుతున్నట్లు సెర్ప్ అధికారుల తనిఖీల్లో ఇటీవల వెల్లడైంది. జిల్లాలో ఇలాంటి వారు సుమారు 240 మంది ఉన్నట్లు ట్రెజరీ శాఖ పీపీవో నంబర్ ఆధారంగా గుర్తించినట్లు సమాచారం. క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని సెర్ప్ అధికారులు డీఆర్‌డీవోకు ఆదేశాలు జారీ చేశారు. పది రోజులల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన పూర్తయితే కాని రెగ్యులర్ పింఛన్‌తో పాటు ఆసరా పింఛన్ ఎంత మంది తీసుకుంటున్నారో కచ్చితంగా తెలిసే అవకాముందని అధికారులు అంటున్నారు. అనర్హులను గుర్తించిన తర్వాత పీపీవో (విరమణ పింఛన్) మంజూరయినప్పటి నుంచి చేయూత పింఛన్‌ను రికవరీ చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా అనర్హులు చేయూత పింఛన్ పొందుతున్నారని ఇటీవల సెర్ప్ తనిఖీల్లో వెల్లడైనట్లు తెలిసింది. రాష్ట్ర సర్కారు దీనిపై మరింత లోతైన విచారణకు ఉపక్రమించింది. ఆయా జిల్లాల నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఎవరు చేయూత పింఛన్ పొందున్నారు? అనే వివరాలు సేకరించిన జాబితాను డీఆర్డీవోలకు పంపించింది. దీనిపై మరోసారి పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వీరుకాక పింఛన్ పొందుతున్న అనర్హుల లెక్కలు కూడా తేల్చాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

వీరికి మాత్రమే చేయూత..

చేయూత పథకం ఎవరికి వర్తిస్తుందో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్లరేషన్ కార్డు ఉన్న ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులు, బీడీ, చేనేత కార్మికులు, దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, ఎయిడ్స్ రోగులకు ఈ పథకం వర్తిస్తుంది.

### క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం..

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విరమణ ఉద్యోగుల్లో కొం దరు చేయూత పింఛన్ పొందుతున్నట్లు సెర్ప్ అధికారుల తనిఖీల్లో గుర్తించారు. సెర్ప్ అధికారులు పంపించిన జాబితా మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం. జిల్లాలో 240 మంది జాబితాను ఎంపీడీవోలకు పంపించి మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించాం.

– కే నాగజ్యోతి, డీఆర్‌డీవో, హనుమకొండ జిల్లా

# దీన్ని ఆఫీస్ అంటారా?

- అధికారులు ఏం చేస్తున్నారు
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు
- టీఎస్ఐఐసీ జోనల్ ఆఫీసు ఆకస్మిక తనిఖీ
- ఫైళ్లను డిజిటలైజ్ చేయాలని ఆదేశం



టీజీఐఐసీ జోనల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

హనుమకొండ, జూలై 4 : 'దీన్ని ఆఫీస్ అంటారా... ఇన్ని రోజులు అధికారులు ఏం చేస్తున్నారు' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మంత్రి ములుగు రోడ్డులోని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (టీఎస్ఐఐసీ) జోనల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఇష్టారీతిన ఫైళ్లు ఉండడం, పాత ఫర్నిచర్, తదితర అంశాలను చూసి అసంతృప్తి వ్యక్తం చేవారు. తెలంగాణ వచ్చి పదేళ్లయినప్పటికీ తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వరంగల్ ఆఫీస్ దుస్థితి ఇలా ఉండడమేంటని అధికారులను ప్రశ్నించారు. మూడు నెలల్లో ఆఫీస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ మార్చాలని, పాత ఫైళ్లను డిజిటలైజేషన్ చేయాలని, అలాగే ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఇల్లీగల్ ఎంక్రోచ్‌మెంట్‌పై న్యాయమైన రిపోర్ట్ తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ రిపోర్ట్‌పై ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం జరిగిన కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. మంత్రిగా నేను, అధికారులుగా మీరు ఎలాంటి ఆఫీస్ వాతావరణంలో కూర్చొని పని చేస్తున్నామో ప్రతి ఉద్యోగి కూడా అదే వాతావరణంలో కూర్చొని పని చేయాలని సూచించారు. తక్షణమే ప్రక్షాళన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అధికారులు, ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేసి సంస్థకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. మంత్రితో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నర్సంపేట మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం



శ్రీనివాస్

నర్సంపేట రూరల్, జూలై 4: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పాలాయి శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సంపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ మూడోసారి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్న పాలాయి శ్రీనివాస్‌ను చైర్మన్‌గా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్‌గా ఖానాపురం మండలకేంద్రానికి చెందిన శాఖమూరి హరిబాబుతోపాటు మరికొంత మందికి కమిటీలో చోటుదక్కింది. డైరెక్టర్లుగా బొల్లు రమేశ్, కొల్లూరి మధుకర్, చీర అశోక్, కోరె కుమారస్వామి, హింగె రామారావు, చెలుపూరి జ్యోతి, అజ్మీ రా ధనుంజయ్‌నాయక్, డ్యాక శ్రీనివాస్, సలాలుద్దీన్, అయ్యూబ్‌ఖాన్, గట్టి సారంగపాణి, స్వామిశెట్టి ప్రభాకర్, బండారి దామోదర్ నియమితులయ్యారు. నూతన పాలకవర్గానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పక్కన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

## 22న దాశరథి శత జయంతి ఉత్సవాలు

- మానుకోటలో ఘనంగా నిర్వహిస్తాం
- ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్, జూలై4: ఈ నెల 22న మానుకోటలో దాశరథి కృష్ణమాచార్యుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ, కవి, రచయిత, గాయకుడు దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నా తెలంగాణ.. కోటి రతనాల వీణ అంటూ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లాలోని సాహిత్యకారులు, కళాకారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అన్ని రంగాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు కన్న, ఎడ్ల వేణుమాధవ్ పాల్గొన్నారు.

## మహదేవపూర్ పీఏసీఎస్‌కు ఎక్సలెన్స్ అవార్డు



పీఏసీఎస్ చైర్మన్‌కు అవార్డును అందజేస్తున్న ఎన్‌సీడీసీ బృందం

మహదేవపూర్, జూలై 4: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి అరుదైన గుర్తిం పు లభించింది. బ్యాంకింగ్ సేవా రంగంలో ఉత్తమ, మెరుగైన సేవలందించినందుకు జాతీయ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని టెస్కాబ్‌లో చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఈ అవార్డును అందజేశారు. సంఘానికి జాతీయ స్థాయిలో అవార్డు రావడంపై పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పెండ్యాల అనిల్, సీఈవో కుమ్మరి రాజబాబు, సభ్యులు పాల్గొన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన నాలుగేళ్ల కూతురు




తండ్రికి తలకొరివి పెడుతున్న నాలుగేళ్ల చిన్నారి వెన్నెల

నర్మెట, జూలై 4 : జనగామ జిల్లా నర్మెట మండలంలోని వెల్దండ గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న గూటం గట్టుమల్లయ్య (45) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. మృతుడికి కూతుళ్లు మాత్రమే ఉన్నారు. దీంతో నాలుగేళ్ల పెద్ద కుమార్తె వెన్నెల తండ్రికి తలకొరివి పెట్టింది. కొడుకులు లేకపోవడం.. అభం శుభం తెలియని చిన్నారి తలకొరివి పెట్టడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# స్టాక్ బ్రోకింగ్ మోసాలపై సెబీ నజర్

### సంస్థాగత యంత్రాంగాన్ని తప్పనిసరి చేస్తూ సర్క్యులర్



న్యూఢిల్లీ, జూలై 4: సెక్యూరిటీస్ మార్కెట్‌లో మదుపరుల ప్రయోజనాల రక్షణార్థం మోసాలను కనిపెట్టి, అరికట్టేందుకు స్టాక్ బ్రోకర్లకు ఓ సంస్థాగత యంత్రాంగాన్ని తప్పనిసరి చేస్తూ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ గురువారం ఓ సర్క్యులర్‌ను విడుదల చేసింది. సవరించిన సెబీ స్టాక్ బ్రోకర్ల రెగ్యులేషన్స్–2024లో భాగంగా ట్రేడింగ్, అంతర్గత కార్యకలాపాల పర్యవేక్షణకు నిఘా వ్యవస్థ, విజిల్–బ్లోయర్ విధానాన్ని పరిచయం చేయడం వంటి సూచనలను ఈ సర్క్యులర్‌లో మార్కెట్ రెగ్యులేటర్ చేసింది. మార్కెట్ సమగ్రత, మదుపరుల ప్రయోజనాల రక్షణే ధ్యేయంగా ఈ రెగ్యులేషన్స్‌ను సవరించిన విషయం తెలిసిందే. కాగా, బ్రోకర్స్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ ఫోరం (ఐఎస్ఎఫ్) కార్యాచరణ పద్ధతులను అనుసరించే ఈ సూచనలు చేసినట్టు సెబీ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఇక 50వేలకుపైగా యాక్టివ్ యూనిక్ క్లయింట్ కోడ్స్ (యూసీసీ) ఉన్న బ్రోకర్లు 2025 జనవరి 1కల్లా సెబీ తాజా నిబంధనలను అమల్లోకి తీసుకురావాలి. 2వేలలోపు యూసీసీలున్న బ్రోకర్లు 2026 ఏప్రిల్ 1కల్లా.. 2001 నుంచి 50వేలదాకా యూసీసీలున్న బ్రోకర్లు 2025 ఏప్రిల్ 1కల్లా సెబీ నిబంధనల్ని ఆచరణలో పెట్టాల్సి ఉన్నది. అలాగే క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు ఈ ఏడాది ఆగస్టు 1కల్లా ఈ సర్క్యులర్‌ను అమలు చేయాల్సి ఉంటుంది. ఈ సర్క్యులర్ వివరాలను స్టాక్ ఎక్స్చేంజీలు సైతం తమతమ వెబ్‌సైట్లలో సెబీ పెట్టాలన్నది.

# మళ్లీ 73 వేలు దాటిన పుత్తడి

### రూ.530 పెరిగిన తులం ధర

న్యూఢిల్లీ, జూలై 4: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ధరలు భారీగా పుంజుకున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పుత్తడి ధర మళ్లీ రూ.73 వేల మార్క్‌ను అధిగమించింది. తులం ధర రూ.530 అధికమై రూ.73,080కి చేరుకున్నది. అంతకుముందు ధర రూ.72,550గా ఉన్నది. పసిడితోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,200 అధికమై రూ.92,500 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.710 పుంజుకొని రూ.73,090కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.650 అధికమై రూ.67 వేలుగా నమోదైంది. అలాగే రూ.1,500 అధికమైన కిలో వెండి రూ.96 వేల నుంచి రూ.97,500కి ఎగబాకింది. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఒకేరోజు 16 డాలర్లు పెరిగి 2,355 డాలర్లకు చేరుకోవడం వల్లనే దేశీయంగా ధరలు పుంజుకున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. అలాగే వెండి కూడా 29.80 డాలర్ల నుంచి 30.25 డాలర్లకు ఎగబాకింది. ఫెడరల్ రిజర్వు మరోసారి వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయంటూ వచ్చిన అంచనాలు బంగారం పెరగడానికి ప్రధాన కారణమన్నారు.

## వాణిజ్య



### ఈఈఎస్ఎల్‌తో హైదరాబాదీ వ్యాపారీ

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇంధన సామర్థ్య పరిష్కారాలను పెంపొందించడానికి ప్రభుత్వరంగ సంస్థ ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మహిళా వ్యాపారవేత్త వధ్య పద్మ ఒప్పందం కుదుర్చుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, మెరుగైన ఆర్థిక వృద్ధి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు మద్దతుగా నిలవడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ ఎంవోయూతో రిటైల్ స్టోర్లను స్థాపించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు సమర్థమైన ఇంధన సాంకేతికలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో భారీ ఎత్తున రిటైల్‌స్టోర్లను విస్తరించాలని ఈఈఎస్ఎల్ లక్ష్యంగా పెట్టుకున్నది.

### సిగ్నిటీలో కోఫోర్జ్‌కి వాటా

న్యూఢిల్లీ, జూలై 4:హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల సంస్థ సిగ్నిటీ టెక్నాలజీలో 11 శాతం వాటాను చేజిక్కించుకున్నది డిజిటల్ సేవలు అందిస్తున్న కోఫోర్జ్. బహిరంగ మార్కెట్లో ఒక్కో షేరుకు రూ.1,412.25 చొప్పున 30,21,293 షేర్లను కొనుగోలు చేయడానికి రూ.426.68 కోట్ల నిధులను వెచ్చించింది.

# బుల్ రన్.. తగ్గేదేలే!

లక్ష పాయింట్లకు సెన్సెక్స్ • వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా సాధ్యమేనన్న అంచనాలు



**45 ఏండ్లలో 800 రెట్లు ఎగిసిన సెన్సెక్స్**

మరో ఏడాదిన్నరలో లక్ష పాయింట్లకు చేరవచ్చన్న అంచనాలు

వాస్తవం

| సంవత్సరం | సెన్సెక్స్ |
|---|---|
| ఏప్రిల్ 1979 | 100 |
| జూలై 2024 | 80,000 |

వ్యవధి: 45 ఏండ్ల 3 నెలలు

చక్రవార్షిక వృద్ధిరేటు 15.9%

అంచనా

| సంవత్సరం | సెన్సెక్స్ |
|---|---|
| ఏప్రిల్ 1979 | 100 |
| డిసెంబర్ 2025 | 1,00,000 |

వ్యవధి: 46 ఏండ్ల 8 నెలలు

**బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ**

| మైలురాళ్లు | చేరిన సంవత్సరం | పట్టిన కాలం |
|---|---|---|
| రూ.100 లక్షల కోట్లు | మార్చి 2014 | |
| రూ.200 లక్షల కోట్లు | ఫిబ్రవరి 2021 | 6 ఏండ్ల 11 నెలలు |
| రూ.300 లక్షల కోట్లు | జూలై 2023 | 2 ఏండ్ల 5 నెలలు |
| రూ.400 లక్షల కోట్లు | ఏప్రిల్ 2024 | 9 నెలలు |
| రూ.447 లక్షల కోట్లు | జూలై 2024 | 3 నెలలు |

ముంబై, జూలై 4: బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్.. వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా లక్ష పాయింట్ల మార్కును చేరుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. 1979 ఏప్రిల్ 1న బేస్ వాల్యూ 100 పాయింట్లతో సెన్సెక్స్ మొదలైంది. ఈ క్రమంలో గురువారం తొలిసారి 80,000 పాయింట్ల ఎగువన ముగిసింది. దీంతో గడిచిన 45 ఏండ్ల కాలంలో వార్షిక చక్ర వృద్ధిరేటు (సీఏజీఆర్) 15.9 శాతంగా ఉన్నది. ఈ వ్యవధిలో సూచీ ఏకంగా 800 రెట్లు ఎగబాకడం గమనార్హం. మరో ఏడాదిన్నరలో 20,000 పాయింట్లు ఎగిసి లక్ష పాయింట్లను తాకుతుందని చెప్తున్నారు.

**ఐదేండ్లలో 40 వేల పాయింట్లు**

గడిచిన ఐదేండ్లలో సెన్సెక్స్ 40,000 పాయింట్లు పెరిగింది. కేవలం 3 నెలల్లోనే 5,000 పాయింట్లు పుంజుకోవడం విశేషం. కాగా, ప్రతీ ఐదేండ్లకు సెన్సెక్స్ రెట్టింపు స్థాయిలో పాయింట్లను పెంచుకుంటూపోతున్నదని దలాల్ స్ట్రీట్ సీనియర్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సహ వ్యవస్థాపకుడు రాందేవ్ అగర్వాల్ అంటున్నారు. ఈ క్రమంలోనే 2029–30 నాటికి సెన్సెక్స్ 1,50,000 పాయింట్లకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేస్తున్నారు. 'భారతీయ కార్పొరేట్ రంగం లాభాలు గత మూడు దశాబ్దాలకుపైగా కాలంలో సుమారు 17 శాతం చక్ర వృద్ధిని సాధించాయి. ఒకవేళ ప్రస్తుత ప్రైస్–టు–ఎర్నింగ్స్ లెవల్స్ 25 రెట్లు ఇలాగే కొనసాగితే సెన్సెక్స్ చక్ర వృద్ధిని 15 శాతంగా భావించవచ్చు. అంటే ప్రతీ ఐదేండ్లకు రెట్టింపు అవుతుందన్నమాట' అని అన్నారు. ప్రముఖ మార్కెట్ మదుపరి మార్క్ మోబియస్ స్పందిస్తూ.. భారత జీడీపీ 7 శాతంతో, కంపెనీలు 14–15 శాతం వృద్ధితో పయనిస్తే.. సెన్సెక్స్ కూడా వచ్చే 10 ఏండ్లలో ఇదే జోష్‌తో పరుగులు పెట్టగలదన్నారు.

**80 వేలపైన తొలిసారి..**


బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారి 80,000 మార్కుకు ఎగువన ముగిసింది. గురువారం 62.87 పాయింట్లు పెరిగి మునుపెన్నడూ లేని విధంగా 80,049.67 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 80,392.64 వద్దకు ఎగిసి ఇంట్రా–డే హై రికార్డునూ నెలకొల్పింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 15.65 పాయింట్లు అందుకుని మొదటిసారి 24,302.15 వద్ద నిలిచింది. ఇంట్రా–డేలో 24,401 పాయింట్లను తాకి సరికొత్త రికార్డు సృష్టించింది. ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా మోటర్స్, సన్ ఫార్మా, కొటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు మదుపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, ఐటీ, టెక్నాలజీ, ఆటో, టెలికం సూచీలు పుంజుకున్నాయి.

**రూ.447.30 లక్షల కోట్లకు..**

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గతంలో ఎప్పుడూ లేనంతగా రూ.447.30 లక్షల కోట్లకు చేరుకున్నది. గురువారం మార్కెట్ ట్రేడింగ్ ముగిసే నాటికి రూ.4,47,30,452.99 కోట్ల (5.36 ట్రిలియన్ డాలర్లు)కు వెళ్లింది. ఈ ఒక్కరోజే రూ.2 లక్షల కోట్లు ఎగిసింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ 0.62 శాతం, 0.60 శాతం చొప్పున పెరిగాయి.

# తగ్గిన సిమెంట్ ధర

### బస్తాపై రూ.20 వరకు



హైదరాబాద్, జూలై 4: సిమెంట్ ధరలు తగ్గుముఖం పట్టాయి. వర్షాకాలం కావడంతో డిమాండ్ అంతకంతకు పడిపోవడంతో సిమెంట్ తయారీ సంస్థలు తమ ధరలను తగ్గించాయి. దీంతో రాష్ట్రంలో బస్తా సిమెంట్ ధర రూ.20 వరకు తగ్గించాయి. ప్రతియేటా వర్షాకాలంలో ధరలు తగ్గడం సహజమని డీలర్ వెల్లడించారు. ఒకవైపు వర్షాలు కురుస్తుండటం, మరోవైపు ప్రభుత్వానికి చెందిన ప్రాజెక్టులు నత్తనడకన సాగుతుండటం, రియల్ ఎస్టేట్ సంస్థలు తమ ప్రాజెక్టుల నిర్మాణాల్లో వేగాన్ని తగ్గించడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. మళ్లీ పండుగ సీజన్ నాటికి ధరలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటడంతో నూతన ప్రాజెక్టుల నిర్మాణాలు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటున్నాయన్నారు. 50 కిలోల అల్ట్రాటెక్ సిమెంట్ బస్తా ధర రూ.310కి దిగిరాగా, బిర్లా రూ.290, చెట్టినాడు రూ.250గాను, ప్రియా బస్తా ధర రూ.245కి తగ్గాయి. మరోవైపు, స్టీల్ ధరలు కూడా భారీగా తగ్గాయి. టన్ను ధర రూ.6 వేలు తగ్గించాయి.

**సిమెంట్ రంగంలో వృద్ధి అంతంతే**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సిమెంట్ రంగంలో వృద్ధి సింగిల్ డిజిట్ 2–3 శాతానికి పరిమితం కానున్నట్లు దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల కారణంగా నిర్మాణ రంగంలో మందకొడి పరిస్థితులు నెలకొనడం ఇందుకు కారణమని తెలిపింది. అయినప్పటికీ 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను సిమెంట్ రంగంలో వృద్ధి 7–8 శాతంగా ఉంటుందని అంచనాను వేస్తున్నది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, గృహ రంగాల్లో సిమెంట్‌కు డిమాండ్ అధికంగా ఉండే అవకాశాలున్నాయని పేర్కొంది. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకం కింద మరిన్ని ఇళ్లు మంజూరు చేయనుండటం, పారిశ్రామిక సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతుండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. దీంతో సిమెంట్ తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే పనిలో పడ్డాయి. ప్రస్తుతం సిమెంట్ రంగంలో ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ అగ్రస్థానంలో ఉండగా, అదానీ గ్రూపు సంస్థ అంబుజా సిమెంట్ కూడా రాణిస్తున్నది. మార్చి 2015లో 45 శాతంగా ఉన్న టాప్ ఐదు కంపెనీల మార్కెట్ వాటా మార్చి 2024 నాటికి 54 శాతానికి పెరిగింది. వచ్చే ఏడాది ఇది 60 శాతానికి చేరుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ అంచనావేస్తున్నది. అలాగే సిమెంట్ కంపెనీ నిర్వహణ లాభాలు కూడా 1–3 శాతం వరకు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపింది.




## ఏజీఆర్‌లో జియో టాప్

న్యూఢిల్లీ, జూలై 4: రిలయన్స్ జియో అత్యధిక సర్దుబాటు స్థూల ఆదాయాన్ని (ఏజీఆర్) ప్రకటించింది. జనవరి–మార్చిలో రూ.25,330.97 కోట్లుగా ఉన్నది. గత ఏడాది ఇదే వ్యవధితో పోల్చితే 10.21 శాతం పుంజుకున్నది. నాడు రూ.22,985 కోట్లేనని గురువారం టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ తెలియజేసింది. ఇక భారతీ ఎయిర్‌టెల్ ఏజీఆర్ 13.25 శాతం ఎగిసి రూ.20,951.91 కోట్లుగా నమోదైంది. నిరుడు రూ.15,500.36 కోట్లే. నష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ సైతం రూ.7,210.63 కోట్ల నుంచి రూ.7,370.75 కోట్లకు పెరిగింది. అయితే ప్రభుత్వ రంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ఏజీఆర్‌లు 4.41 శాతం, 13.78 శాతం చొప్పున తగ్గాయి. బీఎస్ఎన్ఎల్ ఏజీఆర్ ఈ జనవరి–మార్చిలో 1,991.61 కోట్లుగా ఉంటే, ఎంటీఎన్ఎల్‌ది రూ.156.61 కోట్లే.

# రాజస్థాన్‌లో సింగరేణి సోలార్ ప్లాంట్!



రాజస్థాన్ జెన్కో సీఎండీ దేవేంద్ర శ్రింగిని, రాజస్థాన్ రెన్యువబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఎండీ నథ్‌మల్ డైడెల్‌ను, రాజస్థాన్ డిస్కమ్స్ చైర్మన్ భానుప్రకాశ్‌తో ప్రత్యేకంగా ఆయన భేటీ అయ్యారు. ప్లాంట్ ఏర్పాటు, పూర్తయిన తర్వాత విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఇతర విభాగాల్లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే పలు రాష్ర్టాల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సంస్థ..తాజాగా రాజస్థాన్‌లో మెగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి కంపెనీ సీఎండీ బలరాం.. గురువారం ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో విద్యుత్ విభాగ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సింగరేణి ఆధ్వర్యంలో ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని వారు భరోసా ఇచ్చారు. అనంతరం తదితర అంశాలపై వీరు ప్రధానంగా చర్చించారు. ఇప్పటికే 235 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామని బలరాం ఈ సందర్భంగా చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా తెలంగాణతో పాటు ఇతర రాష్ర్టాల్లో కూడా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న యోచనతో ఉన్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్తు ఉన్నతాధికారులను కలిసి ఆ రాష్ట్రంలోని సోలార్ పార్కులో మెగా ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలపై చర్చించినట్టు వివరించారు.